సంస్మరించుకుందాం

# కామ్రేడ్ మండ్ల సుబ్బారెడ్డికి జోహార్లు



**1920లో** కర్నూలు జిల్లా వెలుగోడు గ్రామంలో సాధారణ రైతు కుటుంబంలో కామ్రేడ్ మండ్ల సుబ్బారెడ్డి జన్మించారు. చిన్న వయస్సులో, వ్యవసాయదారునిగా వున్నప్పుడే రైతాంగ పోరాటాలతోను, జాతీయోద్యమంతోను ప్రభావితుల య్యారు. 1936 నాటికి రైతు వృత్తిని వదిలి రైతుసంఘ కార్యకర్త జీవితాన్ని ఎంచుకున్నారు. తెలంగాణా సాయుధ రైతాంగ పోరాట కాలంలో ఆ పోరాట విస్తరణ కోసం నల్లమల ఫారెస్టులో 3 సం॥ల పాటు గెరిల్లా దళానికి బాధ్యత వహించారు. యావదాస్తిని తృణప్రాయంగా అమ్మివేసి ఉద్యమ నాయకత్వానికి అప్పగించారు. హంతక రాజకీయాలున్న కర్నూలు జిల్లాలో రైతు ఉద్యమ నిర్మాణానికి మూడు దశాబ్దాలపాటు కృషిచేశారు. ఆ కాలంలో ఉద్యమ నిర్మాణ కృషి సాగించారు. భూముల సాధన కోసం, జలవనరుల సాధన కోసం ఆందోళనోద్యమాలు నిర్మించారు. రాయలసీమ కరువుకు వ్యతిరేకంగానూ, రాయలసీమ అభివృద్ధి కొరకు సాగిన సమైక్య ఆందోళనలో ఆయన పాల్గొన్న తీరు ఇతర రాజకీయ శ్రేణులకు కూడా స్ఫూర్తినిచ్చింది. దళిత, గిరిజనోద్యమాలకు ఆయన కొండంత అండగా నిలిచారు. విజయనగరం, ఉభయగోదావరి జిల్లా గిరిజనుల మనస్సుల్లో శాశ్వత స్థానాన్ని పొందారు. కామ్రేడ్ ఎమ్మెస్ తుదిశ్వాస విడిచే వరకు, పీడిత ప్రజల విముక్తి కొరకు : ప్రత్యేకంగా రైతుకూలీల విముక్తి కొరకు అహర్నిశలు శ్రమించిన ఆందోళనకారుడు. రైతాంగ విప్లవయోధుడూ, మార్క్సిస్టు–లెనినిస్టు.

1969 నుంచి కుట్రకేసులు ఎదుర్కొన్నారు. ఆయన 6 సం॥ల జైలు జీవితం, 14 సం॥ల అజ్ఞాత జీవితం గడిపారు. కోర్టులలో కేసులను ఆయన స్వయంగా వాదించుకున్న తీరూ, 1971లో నందికొట్కూరు కోర్టులో "నరహంతక జలగం వెంగళరావును ఉరితీయాల"ని ఆయన చేసిన ప్రకటనా ఎమ్మెస్ వర్గ పోరాటతత్వానికి, వర్గ శత్రువుపట్ల కరకుదనానికి నిదర్శనం.

1986లో రైతుకూలీ పేదల సంఘం సంస్థాపక కార్యదర్శిగా, 1991లో రైతుకూలీ సంఘంగా ఐక్యమైన నాటి నుండి చనిపోయే వరకు రాష్ట్ర అధ్యక్షులుగా సంస్థకు నేతృత్వం వహించారు. 2001 ఏప్రిల్ 24న 10 రోజులపాటు మృత్యువుతో పోరాడి కా॥ఎం.ఎస్. అమరులయ్యారు.

కా॥ ఎమ్మెస్ మరణం పీడిత ప్రజా వుద్యమాలకు, ప్రత్యేకించి రైతాంగ ఉద్యమానికి తీరనిలోటు. అయినా విప్లవ విజయం పట్ల కార్మిక–కర్షక రాజ్యస్థాపన పట్ల కామ్రేడ్ ఎమ్మెస్ ఎంత అచంచల విశ్వాసంతో కృషిచేశారో అంతే విశ్వాసంతో కన్నీరు వత్తుకుంటూనే విప్లవ విజయం కోసం మొక్కవోని దీక్షతో ముందుకు సాగుదామని ప్రతినబూనుదాం.

* * * * *